క్లుప్తంగా

కాలుష్య నియంత్రణకు వారంలో ఓ రోజు



ఆర్టీసీ బస్సు నుంచి దిగుతున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: విశాఖ నగరంలో కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరూ వారంలో ఒక రోజు వ్యక్తిగత వాహనాలు విడనాడి ప్రజా రవాణాను వినియోగించాలని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పిలుపునిచ్చారు. సోమవారం తన క్యాంపు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా సామాజిక బాధ్యతగా జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు వారంలో ఓ రోజు వ్యక్తిగత వాహనాలు వీడి, ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగిస్తున్నారన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు కూడా వ్యక్తిగత వాహనాలు వీడి, సైకిళ్లు లేదా ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించి, కాలుష్య నివారణకు సహకరించాల్సిందిగా కోరారు.

పరిశోధన కేంద్రాలతో విద్యార్థుల అనుసంధానం



ఏడీ విజయ్‌కుమార్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఫార్మా పరిశ్రమలు, పరిశోధన కేంద్రాలతో అనుసంధానం కావాలని డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.విజయ్‌కుమార్ సూచించారు. ఏయూ ఫార్మసీ కళాశాల 74వ వార్షికోత్సవాన్ని సోమవారం బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో ఉండే కాలాన్ని విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆచార్యుల నుంచి సంపూర్ణ జ్ఞానాన్ని పొందే దిశగా నిరంతరం కృషి చేయాలని సూచించారు. యువతరం మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, విద్యార్థులు తమ కలలను, తల్లిదండ్రుల ఆకాంక్షలను సాకారం చేసుకోవాలన్నారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ ఫార్మా రంగంలో కూడా ఐవోటీ, ఏఐ, డేటా ఎనలిటిక్స్ వంటివి అంతర్భాగం చేయాల్సిన అవసరముందన్నారు. ఫార్మా రంగంలో ఉన్న అపారమైన డేటాను విశ్లేషిస్తే మంచి ఫలితాలను పొందవచ్చని చెప్పారు. దీనికి అవసరమైన సాంకేతికతలను, పలు ఆన్‌లైన్ కోర్సులను ఫార్మా విద్యార్థులు నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫార్మా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.గిరిజా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బార్లలో పోలీసుల తనిఖీలు



బార్‌లో రికార్డులు పరిశీలిస్తున్న పోలీసులు

విశాఖ సిటీ: విశాఖలో బార్ అండ్ రెస్టారెంట్లు, పబ్‌లపై పోలీసులు ఆకస్మిక దాడులు చేశారు. సుమారు 450 పోలీస్ అధికారులు, సిబ్బందితో 92 బృందాలుగా 104 బార్లు, పబ్‌ల్లో ఏకకాలంలో తనిఖీ చేపట్టారు. ఇందులో సంబంధిత శాఖల నుంచి లైసెన్సులు లేకుండా వ్యాపారం, మైనర్లకు మద్యం విక్రయాలు, ఫైర్ ఎన్‌ఓసీలు, సీసీటీవీ, అక్రమ మద్యం, ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయాలు ఇలా అనేక అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో 23 బార్లలో నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరకు మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించారు. 14 బార్లకు ఫైర్‌ఎన్‌ఓసీ, 2 బార్లలో సీసీటీవీ కెమెరాలు, ఒకచోట ఫుడ్ లైసెన్స్ లేకుండా రెస్టారెంట్ నిర్వహణ, ట్రేడ్ లైసెన్సులు లేకుండా 2, పార్కింగ్ సదుపాయం లేకుండా 14, జీఎస్టీ లేకుండా ఒక బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహిస్తున్నట్లు తేల్చారు. సదరు బార్లపై చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలకు సిఫార్సు చేశారు.

ఇదేనా స్వచ్ఛత..!

నగరంలో విస్తృతంగా స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. త్వరలో స్వచ్ఛ సర్వేక్షణ్ కూడా జరగనుంది. జాతీయ స్థాయిలో విశాఖను అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని, దేశంలోనే ప్రథమ స్థానం లక్ష్యమంటూ అధికారులు చెబుతున్నారు. వాస్తవికతను పరిశీలిస్తే.. పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. పారిశుధ్య నిర్వహణ లోపంతో స్వచ్ఛత ఎక్కడా కానరావడం లేదు. పర్యాటక ప్రాంతం బీచ్ రోడ్డు దుస్థితే ఇందుకు నిదర్శనం.

– ఏయూక్యాంపస్

- అధ్వానంగా బీచ్ రోడ్డు
- మట్టి, దుమ్మూధూళితో నిండిన ఫుట్‌పాత్‌లు
- అడుగడుగునా పారిశుధ్య లోపం
- ఇబ్బంది పడుతున్న సందర్శకులు



బీచ్ రోడ్డులో మరకలు పడి అధ్వానంగా మారిన ఫుట్‌పాత్



పాండురంగాపురంలో అధ్వానంగా పరిసరాలు



బీచ్ రోడ్డులో మట్టి, దుమ్ముతో దర్శనమిస్తున్న పరిసరాలు



బీచ్ రోడ్డు దుస్థితి

నిత్యం వేలాది మంది పర్యాటకులు, నగరవాసులు సందర్శించే బీచ్ రోడ్డు అధ్వానంగా దర్శనమిస్తోంది. పారిశుధ్య నిర్వహణ ఇక్కడ కేవలం కంటి తుడుపుగా మారిపోయింది. స్వచ్ఛత అడుగడుగునా లోపాలతో దర్శనమిస్తోంది. దేశ విదేశాలు, పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే పర్యాటకులు ఇక్కడి పరిస్థితులు చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. అధికారులు వాస్తవాలను గ్రహించి మూలాల నుంచి ప్రక్షాళన చేస్తేనే విశాఖకు పూర్తి స్థాయిలో గుర్తింపు లభిస్తుంది. దీనికి భిన్నంగా కేవలం సమావేశాలకు, ప్రచారాలకు ప్రాధాన్యమిస్తూ క్షేత్రస్థాయిలో లోపాలను సరిదిద్దని పక్షంలో మెరుగైన ర్యాంక్‌ను సాధించే అవకాశాన్ని చేజేతులా కోల్పోతుంది.

అపరిశుభ్రంగా పరిసరాలు

నగరానికి తొలిసారిగా వచ్చే ప్రతి వ్యక్తి బీచ్ రోడ్డును సందర్శించడానికి వస్తారు. కాలినడకన బీచ్ రోడ్డులో ఫుట్‌పాత్‌లపై నడుస్తూ సుందరమైన ప్రకృతిని, సముద్ర తీరాన్ని వీక్షించడానికి, ఫొటోలు తీసుకోవడానికి ఆసక్తి చూపుతారు. ఫుట్‌పాత్‌లపై నడిచే వారికి ఇక్కడ అపరిశుభ్ర పరిసరాలు కొంత ఇబ్బందిని తెప్పిస్తున్నాయి. కాసేపు సేదతీరుదామని ఎక్కడైనా కూర్చుందామని చూస్తే దుమ్ము, మట్టి పేరుకుపోయి అధ్వానంగా కనిపిస్తున్నాయి. పొరపాటున వీటిపై కూర్చుంటే వారి దుస్తులకు ఈ దుమ్ము అంటుకుపోవడం తథ్యం.

ఫుట్‌పాత్‌లను ఆనుకుని గతంలో ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహాల పరిసరాలు దారుణంగా ఉన్నాయి. బీచ్‌కు వచ్చిన వారు మహనీయుల విగ్రహాలను చూసి, వారి వివరాలు తమ చిన్నారులకు చెప్పాలని అనుకుంటారు. అటువంటి సమయంలో ఇక్కడ విక్రయాల పరిస్థితి, వాటి చుట్టూ ఉన్న పరిసరాలు వారికి కొంత ఇబ్బందిని కలిగిస్తున్నాయి.

కళావిహీనంగా కాలిబాటలు

బీచ్ రోడ్డులో చిరువ్యాపారాలు చేసే వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వీరు ఆహార పదార్థాలను ఫుట్‌పాత్‌లపై పడేయడం, వివిధ వస్తువులు, గిన్నెలు కడిగిన నీటిని అక్కడే పారబోస్తున్నారు. దీంతో ఫుట్‌పాత్‌లు నల్లగా మారిపోతున్నాయి. వీటి సహజమైన రంగును కోల్పోయి కళావిహీనంగా తయారవుతున్నాయి. చిరుదుకాణాల నుంచి వచ్చే వ్యర్థాలను డస్ట్‌బిన్‌ల నుంచి రాత్రివేళల్లో సేకరించే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఉదయాన్నే వాకింగ్‌కు వచ్చే వారికి వ్యర్థాలు పశువులు, కాకులు తీసుకొచ్చి ఫుట్‌పాత్‌లపై పడేస్తూ అసౌకర్యంగా నిలుస్తున్నాయి. ఫుట్‌పాత్‌లను సైతం ప్రత్యేకంగా నీటితో శుభ్రం చేసే దిశగా ఆలోచించాలి.

సమన్వయంతో పనిచేయాలి

నగరానికే తలమానికంగా నిలిచే విశాఖ బీచ్ రోడ్డును మరింత పరిశుభ్రంగా ఉంచే దిశగా అధికారులు, పారిశుధ్య విభాగం సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే రుషికొండ బీచ్‌కు బ్లూ ఫ్లాగ్ గుర్తింపును కోల్పోయాం. సాగర తీరాన్ని సైతం శుభ్రంగా, మరింత ఆహ్లాదంగా ఉంచితేనే పర్యాటకం పెరుగుతుంది. లేని పక్షంలో నగరానికి పర్యాటకుల సంఖ్య తగ్గిపోయే అవకాశముంది. స్వచ్ఛతను కేవలం మాటలకే పరిమితం చేయకుండా కార్యరూపంలో చూపాల్సిన అవసరముంది. ఈ దిశగా అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని పలువురు నగరవాసులు సూచిస్తున్నారు.

కరాటే పోటీల్లో పూర్వి సత్తా



పూర్వి రజక్‌ను అభినందిస్తున్న కోచ్‌లు

ఎంవీపీకాలనీ: మచిలీపట్నం వేదికగా ఇటీవల జరిగిన జాతీయ స్థాయి జేఎస్‌కేఎస్ ఆలిండియా ఓపెన్ కరాటే పోటీల్లో విశాఖ విద్యార్థిని పూర్వి రజక్ ప్రతిభ చూపింది. ప్రస్తుతం ఎంవీపీ కాలనీలోని లిటిల్ ఏంజిల్స్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న పూర్వి రెండు కేటగిరీల్లో సత్తా చాటింది. కుమిటే కేటగిరీలో ప్రథమ స్థానంలోను, కటా కేటగిరీలో ద్వితీయ స్థానంలో నిలిచి పతకాలు సాధించింది. ఈ సందర్భంగా సోమవారం పూర్వి రజక్‌ను పాఠశాల యాజమాన్యం, కోచ్‌లు రమణమూర్తి, దిలీప్ అభినందించారు.

యువకుడి అదృశ్యం

ఎంవీపీకాలనీ: వెంకోజీపాలేనికి చెందిన బూటు సంతోష్ అనే యువకుడు అదృశ్యమైనట్లు సోమవారం ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. పాత వెంకోజీపాలెం, సన్ స్కూల్ సమీపంలో తల్లిదండ్రులు, తమ్ముడితో కలిసి బూటు సంతోష్ నివసిస్తున్నాడు. ఈ నెల 16వ ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. అతడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికినా ఫలితం లభించలేదు. పైడా డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదివిన సంతోష్ ప్రస్తుతం ఇంటర్న్‌షిప్ చేస్తున్నాడు. కొంతకాలంగా ఒక అమ్మాయితో సంతోష్ సన్నిహితంగా ఉండగా.. ఇటీవల ఆమెకు వేరే వ్యక్తితో వివాహం జరిగింది. మనస్తాపానికి గురైన సంతోష్ ఇంటి నుంచి వెళ్లిపోయి ఉంటాడని యువకుడి తండ్రి సూరప్పడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని హెచ్‌సీ రాంబాబు కోరారు.

సెంట్రల్ జైలులో 'సెల్'చల్

కీలకధారి ఫార్మసిస్టే!

- సెల్‌ఫోన్ అందజేసేందుకు రూ.లక్ష ఒప్పందం
- ఫార్మసిస్ట్ భార్యకు నిందితుడి బంధువులు ఫోన్‌పే
- ఖైదీలకు గంజాయి సరఫరా చేసింది కూడా ఫార్మసిస్టే
- శ్రీనివాసరావు దంపతులకు రిమాండ్
- సెల్‌ఫోన్ వ్యవహారంపై లోతుగా దర్యాప్తు



విశాఖ కేంద్ర కారాగారం

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో సెల్ ఫోన్ కథ గుట్టు వీడుతోంది. సెల్ ఫోన్లు వినియోగించిన ఖైదీలు, వీటిని చేరవేసిన వారి వ్యవహారం బయటపడుతోంది. మూడు నెలలు క్రితం ఖైదీలకు గంజాయి చేరవేయడంతో ఒక్కసారిగా విశాఖ సెంట్రల్ జైల్ వార్తలకెక్కింది. అప్పటి నుంచి వరుసగా వివిధ సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఓ ఖైదీ ఆత్మహత్య చేసుకోగా..నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై బదిలీవేటు వేయగా..కొందరు అధికారులు సస్పెన్షన్‌కు గురయ్యారు. మరొకొందరికి మెమోలు జారీ అయ్యాయి. ఇంత జరిగినా దఫదఫాలు జైలులో నాలుగు సెల్ ఫోన్లు బయటపడడంతో జైలు అధికారులు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదులు చేశారు. దర్యాప్తులో భాగంగా రెండు సెల్ ఫోన్లు ఖైదీలకు చేరవేసిన వ్యక్తిని కనిపెట్టారు. మిగిలిన సెల్ ఫోన్లు ఎవరు అందజేశారో దర్యాప్తులో తేలనుందని ఆరిలోవ పోలీసులు చెప్పారు.

ఫార్మసిస్టే కీలకధారి

ఇక్కడ కేంద్ర కారాగారంలో ఫార్మసిస్ట్‌గా పనిచేసిన కడియం శ్రీనివాసరావు మూడు నెలల క్రితం భోజనం క్యారేజీలో గంజాయి తీసుకొని లోపలకు వెళుతుండగా జైల్ ప్రధాన ద్వారం వద్ద సిబ్బందికి పట్టుబడ్డాడు. దీంతో అతనిని విధుల నుంచి తొలగించారు. అనంతరం జైల్ లోపల సెల్ ఫోన్లు కలకలం రేపాయి. వాటిలో రెండు సెల్ ఫోన్లు శ్రీనివాసరావు ఖైదీలకు అందించినట్లు పోలీసుల దర్యాప్తుల్లో వెల్లడైంది. శ్రీనివాసరావుకు సహకరించిన ఆయన భార్య పుష్పలతను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. రెండు సెల్ ఫోన్లను జైల్‌లో శిక్ష అనుభవిస్తున్న నాగమల్లేశ్వరరావు అనే ముద్దాయికి శ్రీనివాసరావు ఇచ్చాడు. ఇందుకు గానూ రూ.లక్షకు ఒప్పందం కుదుర్చుకొన్నాడు. రూ.లక్ష శ్రీనివాసరావు భార్య పుష్పలత బ్యాంక్ అకౌంట్‌కు వేసే విధంగా బేరం కుదుర్చుకున్నారు. దీంతో నాగమల్లేశ్వరరావు కుటుంబ సభ్యులు పుష్పలతకు ఫోన్‌పే ద్వారా కొంత మొత్తం , మిగిలినది నేరుగా అందించారు. ఈ ఫోన్లు, నగదు లావాదేవీల వ్యవహారంలో పుష్పలత కూడా భాగస్వామి కావడంతో ఆమెను అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపారు. జైలులో నాగమల్లేశ్వరరావు ఫోన్ వినియోగిస్తున్న విషయం గమనించిన ఓ కిడ్నాప్ కేసులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న హేమంత్, మరో ఖైదీ రాజేష్ వాటిలో ఓ ఫోన్ తీసుకొన్నారు. ఆ ఫోన్ వాళ్లిద్దరు వినియోగించేలోగే వాటి గుట్టు రట్టు అయింది. మిగిలిన ఫోన్ల వ్యవహారం కూడా త్వరలోనే బయటపడనుందని, వాటిపై కూడా లోతుగా దర్యాప్తు జరుగుతోందని ఆరిలోవ సీఐ సీహెచ్.మల్లేశ్వరరావు తెలిపారు.

రాత మొదలైంది...



తోటగరువు హైస్కూల్ గేటు వద్ద పదో తరగతి విద్యార్థులు, తల్లిదండ్రులు

- ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు
- సమయానికే పరీక్ష కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు



బోర్డుపై రూమ్ నంబర్లు వెతుకుతున్న విద్యార్థులు



అంధ విద్యార్థిని పరీక్ష రాయడానికి తీసుకెళ్తున్న ఉపాధ్యాయుడు



తోటగరువు కేంద్రంలో పరీక్ష రాస్తున్న టెన్త్ విద్యార్థులు

ఆరిలోవ: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యా శాఖాధికారులు ఆరిలోవ ప్రాంతంలో ఆరు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. సుమారు 1,000 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరిగింది. తొలి రోజు తెలుగు పరీక్ష కోసం విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు తల్లిదండ్రులతో కలిసి చేరుకున్నారు. దీంతో వాటి వద్ద సందడి నెలకొంది. పోలీసులు విద్యార్థులను ఉదయం 8.45 గంటలకు పరీక్ష కేంద్రాల్లోకి విడిచిపెట్టారు. హాల్ టికెట్ నంబర్ల ద్వారా కేటాయించిన గదులకు చేరుకుని పరీక్ష రాశారు. తోటగరువు హైస్కూల్ కేంద్రంలో ఓ అంధ విద్యార్థి పరీక్షకు హాజరయ్యాడు. ఆ విద్యార్థికి సహాయకుడిని ఏర్పాటు చేశారు.

పేరుకే 144 సెక్షన్..

అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించినట్లు విద్యా శాఖాధికారులు ముందుగానే ప్రకటించారు. ఆరిలోవలో మాత్రం ఎక్కడా అమలుకాలేదు. పరీక్షల కోసం వచ్చిన విద్యార్థులను లోపలకు విడిచిపెట్టినంతవరకు ఉన్న పోలీసులు పరీక్ష జరుగుతున్న సమయంలో ఎక్కడా కానరాలేదు. దీంతో కేంద్రాల వద్దకు తల్లిదండ్రులు గుంపులుగా చేరారు. తోటగరువు జెడ్పీ హైస్కూల్ కేంద్రంలో పరీక్ష జరుగుతుండగా గోడల వద్దకు వెళ్లి గదుల్లో పరీక్షలు రాస్తున్న తమ పిల్లలను చూడడానికి కొందరు ఎగబడ్డారు. గంటల తరబడి వారు గోడల పైనుంచి చూస్తున్నప్పటికీ అక్కడ పోలీసులు ఎవ్వరూ వారిని నియంత్రించలేదు. దీంతో 144 సెక్షన్ ఇక్కడ ప్రశ్నార్థకంగా మారిందంటూ స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. విద్యార్థులకు స్లిప్‌లు అందించడానికి వెళ్తున్నట్లు గోడల వద్దకు వెళ్లి ఎగిరి చూస్తున్నా పట్టించుకోలేదని పోలీసుల తీరుపై విమర్శిస్తున్నారు.

నేర రహిత సమాజానికి సహకరించండి



మాట్లాడుతున్న ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి



సమావేశంలో పాల్గొన్న బార్ అండ్ రెస్టారెంట్లు, వైన్‌షాపులు, లాడ్జీల నిర్వాహకులు

- మద్యం షాపులు, లాడ్జీల నిర్వాహకులతో ద్వారకా ఏసీపీ

ఆరిలోవ: మద్యం షాపులు, లాడ్జీల నిర్వాహకులు నేర రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని ద్వారకా ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి కోరారు. ఆరిలోవ పెదగదిలి దరి ఎర్నిదుర్గమాంబ కల్యాణ మండపంలో సోమవారం ద్వారకా జోన్ పరిధిలోని బార్ అండ్ రెస్టారెంట్లు, వైన్ షాపులు, లాడ్జీల నిర్వాహకులతో పోలీసులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ బార్ అండ్ రెస్టారెంట్లు, వైన్ షాపులు, లాడ్జీల నిర్వాహకులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. మైనర్లకు మద్యం విక్రయించకూడదని, ల్యాడ్జీలకు వచ్చే మైనర్లకు అవకాశం ఇవ్వకూడదన్నారు. లాడ్జీలకు వచ్చేవారి నుంచి ఆధార్ కార్డులు పరిశీలించాలని, జంటలుగా వచ్చేవారు భార్యాభర్తలా, వేరే వారా అనేది నిర్ధారించుకోవాలని సూచించారు. బార్ అండ్ రెస్టారెంట్లు, మద్యం దుకాణాలు, లాడ్జీల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో అల్లర్లు జరగకుండా కట్టడి చేయడానికి పోలీసులకు సహకరించాలని కోరారు. ఓపెన్‌గా మద్యం తాగుతున్న వారి వల్ల హత్యలు, గొడవలు జరుగుతున్నాయన్నారు. సీసీ టీవీలతో పాటు డ్రోన్‌లు ఇవ్వడానికి తమవంతుగా ముందుకు రావాలన్నారు. వాటిని అవసరమైన చోట్ల ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. వాటి వల్ల అల్లర్లు, హత్యలు తగ్గుతాయని తెలిపారు. సమావేశంలో ద్వారకా సీఐ వెంకటరమణ, పలువురు ఎస్‌ఐలు, సుమారు 150 మందికి పైగా బార్ అండ్ రెస్టారెంట్లు, వైన్ షాపులు, ల్యాడ్జీల నిర్వాహకులు పాల్గొన్నారు.

జంతు ప్రేమకు దర్పణం



మూగజీవాలు తమ సమస్యను చెప్పుకోలేవు. మనమే తెలుసుకుని వాటికి చికిత్స అందించాలి. యజమానులు ఎంతో ప్రేమగా సాకుతుంటారు. అవసరమైప్పుడు వైద్యుల వద్దకు తీసుకెళ్లి చికిత్సలు అందిస్తారు. పలువురు జంతు ప్రేమికులు తమ కుక్కలను వైద్యం కోసం సోమవారం తమతోపాటు ద్విచక్రవాహనాలపై కూర్చోపెట్టుకుని, చేతి సంచిలో ఎండ తగలకుండా.. ఇలా అనేక విధాలుగా ప్రభుత్వ పశువైద్యశాలకు తీసుకువచ్చారు.

ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

అంగన్‌వాడీ కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు



కేఆర్‌ఎం కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో రిజిస్టర్ తనిఖీ చేస్తున్న గొండు సీతారాం

మద్దిలపాలెం: మద్దిలపాలెం సెక్టార్ కేఆర్‌ఎం కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం–1లో సోమవారం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం ఆకస్మిక తనిఖీలు చేశారు. అంగన్‌వాడీ వర్కర్ సుబ్బలక్ష్మితో మాట్లాడి పిల్లల సమాచారం తెలుసుకున్నారు. తక్కువ ఎత్తు, బరువున్న పిల్లలకు ఎటువంటి పౌష్టికాహారం ఇస్తున్నారు, గతేడాదిలో ఉన్న మొత్తం చిన్నారుల్లో ఆడ, మగ పిల్లల సంఖ్య ఎంత, గర్భిణులు, బాలింతలు ఎంతమంది అని ఆరా తీశారు. వారికి పౌష్టికాహార రూపంలో ప్రభుత్వం అందిస్తున్న పదార్థాలు ఏ ప్రాతిపదికన ఇస్తున్నది పరిశీలించారు. ఈ విద్యా సంవత్సరంలో ఎంతమంది పిల్లలను పాఠశాలల్లో చేర్పుతున్నారని అడిగి తెలుసుకున్నారు. స్టాక్, ఇతర రిజిస్టర్లతో పాటు బాలామృతం, కోడిగుడ్ల పంపిణీని పరిశీలించారు. సూపర్‌వైజర్, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్లు, ఇతర ఉన్నతాధికారులు ఎన్ని రోజుల కోసారి అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక, ప్రభుత్వం చెల్లిస్తున్న అద్దెలు సరిపడక చిన్నపాటి గదుల్లో ఎక్కువ మంది పిల్లలు ఉండటం కమిషన్ దృష్టికి వచ్చిందన్నారు. సొంత స్థలాలున్న చోట ప్రభుత్వం భవనాలు నిర్మించేలా చర్యలు చేపట్టాలని సూచించామని తెలిపారు. ఇప్పటికే తమ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ సిఫార్సులు చేశామన్నారు.

నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నాణ్యమైన వైద్యం

బీచ్‌రోడ్డు: వైద్య రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని రోగులకు మరింత నాణ్యమైన వైద్యం అందించాలని ఇంటర్వెన్షనల్ రేడియాలజీ డాక్టర్ వెంకటేష్ అన్నారు. నగరంలోని ఒక హోటల్‌లో సోమవారం కీళ్ల నొప్పుల పరిష్కారంలో వైద్య రంగంలో వస్తున్న చికిత్సలపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానంతో కీళ్ల నొప్పులకు సర్జరీలు అవసరం లేకుండా మినిమల్లీ ఇన్వాసివ్ ప్రక్రియ, జెనిక్యులర్ ఆర్టరీ ఎంబోలైజేషన్ వంటి విధానాల ద్వారా నొప్పులను తొలగించవచ్చన్నారు. ఈ విధానాల ద్వారా 60 ఏళ్ల వయసు నిండిన వారిలో 80 శాతం మందికి మోకాళ్ల నొప్పులు లేవని పలు నివేదికలు తెలుపుతున్నాయన్నారు.

నేవీ మారథాన్‌కు సన్నాహాలు



సన్నాహక పరుగులో పాల్గొన్న నేవీ ఉద్యోగులు, నగరవాసులు

ఏయూక్యాంపస్: నేవీ మారథాన్‌కు సన్నాహకంగా ఐఎన్‌ఎస్ కళింగ, సింగ్పి ఇండస్ట్రీస్‌తో సంయుక్తంగా తొలి కండీషనింగ్–స్ట్రెంత్ ట్రెనింగ్ రన్‌ను బీచ్‌రోడ్డులో నిర్వహించారు. ఈ పరుగులో 350 మందికిపైగా పాల్గొన్నారు. విశాఖ నేవీ మారథాన్‌లో పాల్గొనేవారికి సన్నాహకంగా వీటిని నిర్వహిస్తున్నారు. ప్రతీ నెల రెండో శనివారం ఆరోగ్య జీవనాన్ని ప్రోత్సహించే విధంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు.